మణిపూర్ మారణ హోమానికి నిరసనగా 'ఏఐవైఎఫ్' ర్యాలీ

విశాలాంధ్ర-నరసన్నపేట : మణిపూర్ మారణ హెూమానికి నిరసనగా సోమవారం అఖిల భారత యువజన సమైఖ్య(ఏఐవైఎఫ్) విధ్యార్థులచే ర్యాలీ నిర్వహించింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుండి వైఎస్ఆర్ జంక్షన్ వరకూ నిర్వహించిన ఈ ర్యాలీలో పలు ప్రైవైటు విద్యా సంస్థలకు చెందిన విధ్యార్థులు పాల్గొని, దేశ ప్రధాని, నరేంద్ర మోడీకి, కేంద్ర హెూమ్ శాఖ మంత్రి, అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి, కొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన ప్రధాని, మోడీ, హెూమ్ శాఖ మంత్రి, అమిత్ షా రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా ప్రవర్తించటం అన్యాయమన్నారు. బిజేపి ప్రభుత్వం అధికారమే ధ్యేయంగా దేశంలో పలు చోట్ల మత కలహాలను రేపుతూ గిరిజన తెగల మధ్య దాడులను ప్రోత్సాహిస్తుందని విమర్శించారు. మణిపూర్ ఘటనలో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగింపు చేయటం కిరాతక చర్యని, రాబోయే రోజుల్లో బిజేపిని దేశం నుండి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు మణిపూర్ ఘటనపై నిరసన తెలుపుతుంటే ప్రధాని నోరు మెదపక పోవటం ఆశ్చర్యానికి గురి చేస్తుందని దుయ్యబట్టారు. ఒక గిరిజన మహిళ రాష్ట్రపతిగా వున్న ఈ దేశంలో మహిళలపై అన్యాయాలు జరుగుతుంటే బిజేపి ప్రభుత్వం ఖండించకపోవటం విచిత్రంగా వుందని, ఈ ఘటనపై కేంద్ర మంత్రి, అమిత్ షా తమ పదవులకు రాజీనామా చేయాలని ఏఐవైఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ నాయకులు, కర్ణవీరుడు, ఆమోష్, చాణక్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేయాలి

కలెక్టర్‌ను కోరిన డీఎంఏసీ సభ్యులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఆన్లైన్లో అక్రిడిటేషన్ లకు దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ(డీఎంఏసీ) సభ్యులు కొంక్యాన వేణుగోపాల్, ఎన్. ఈశ్వరరావు కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్‌ను కోరారు. ఈ మేరకు డీఎంఏసీ సభ్యులు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని జెడ్పి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు డీఎంఏసీ సభ్యులు కొంక్యాన వేణు గోపాల్, ఈశ్వరరావు అందజేశారు. జిల్లాలో 1200 మందికిపైగా పాత్రికేయ వృత్తిలో ఉన్నారని, గతంలో వీరందరికీ అక్రిడిటేషన్లు మంజూరయ్యాయని, ప్రముఖ పత్రికలకు అన్ని మండలాల్లో విలేకరులకు, డెస్క్ లో పనిచేసే సబ్ ఎడిటర్లకు కలిపి సుమారు 50, చిన్న మధ్యతరహా పత్రికలకు 15 అక్రిడిటేషన్లు మంజూరు అయ్యేవని పేర్కొన్నారు. జిల్లాలో పనిచేస్తున్న పలు లోకల్ ఛానల్స్ జిల్లా కేంద్రంలోనే కాకుండా జిల్లాలోని దాదాపుగా అన్ని ప్రాంతాల్లోనూ దశాబ్దాల కాలంగా ప్రసారమవుతున్నాయని, ఈఛానళ్లకు గతంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున పది అక్రిడిటేషన్లు మంజూరు అయ్యేవని, తర్వాత కాలంలో ప్రభుత్వాలు విధించిన నియమ నిబంధనలు మూలంగా 600 మందికి మాత్రమే అక్రిడిటేషన్లు వచ్చినట్టు పేర్కొన్నారు. గత ఏడాది 542 మందికి అక్రిడిటేషన్లు మంజూరు అయ్యాయని, ప్రధాన పత్రికలుగా ప్రభుత్వం గుర్తించిన వాటికి అన్ని మండలాలకు, తర్వాత క్రమంలో ఉన్నవాటిగా గుర్తించిన పత్రికలకు 21 చొప్పున, చిన్న మధ్యతరహా పత్రికలకు, లోకల్ ఛానల్స్‌కు కేవలం రెండు మాత్రమే మంజూరవు తున్నాయని పేర్కొన్నారు. దీనిమూలంగా నియోజకవర్గ కేంద్రాల్లోనూ, ప్రధాన కార్యాలయం, ప్రింటింగ్ యూనిట్లో పనిచేసే డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ సౌకర్యం లేకుండాపోతుందని వీరు కలెక్టరు వివరించారు. ఈ ఏడాది కూడా అదే సంఖ్యలో జర్నలిస్టులు అక్రిడిటేషన్లు పొందడానికి అర్హులై ఉన్నారని, ఈ ఏడాది జూన్ 16న నిర్వహించిన అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో 302 మందికి అక్రిడిటేషన్లు మంజూరు చేయగా, రెండో విడతగా 110 మందికిపైగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోగా, వారిలో 60 మందికి మాత్రమే ఇచ్చారని, మిగిలిన 50 మందికి కూడా అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని డీఎంఏసీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. 2024 లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో న్యూస్ కవరేజ్‌కు వెళ్లనున్న విలేకరులలో అక్రిడిటేషన్లు లేనివారికి సెక్యూరిటీపరంగా ఐడెంటిటీ విషయంలో ఇబ్బందులు ఎదురుకానున్న నేపథ్యంలో అందరికీ అక్రిడిటేషన్లు ఇచ్చేలా అవకాశం కల్పించాలని కోరారు. ఫ్రీలాన్స్, వెటర్న్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలని కలెక్టర్ రె కోరారు. కలెక్టర్ ను కలిసిన వారిలో వివిధ పత్రికల్లో పనిచేస్తున్న విలేకరులు ఉన్నారు. జర్నలిస్టుల అభ్యర్థనలను పరిశీలించాలని జిల్లా కలెక్టర్ డిపిఆర్వో బాలా సింగ్‌ను ఆదేశించారు.

జిల్లా ఎస్పీని కలిసిన సిఐ ప్రసాదరావు

విశాలాంధ్ర-నరసన్నపేట : శ్రీకాకుళం జిల్లా ఎస్పీ, జి.ఆర్.రాధికను సోమవారం నరసన్నపేట సిఐగా నూతనంగా బాధ్యతలు నిర్వహించిన బి.ప్రసాద్‌రావు జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా ఆయన ఎస్పీకి పుష్పగుచ్ఛాన్ని అందచేశారు. అనంతరం ఎస్పీ, రాధిక మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా సిఐలు బాధ్యతలు చేపట్టాలని కోరారు. అంతకుముందు నరసన్నపేట సిఐగా పనిచేసిన డి.రాముకు విశాఖపట్నం బదిలీపై వెళ్ళటం పాఠకులకు తెలిసిందే.

విద్యార్థినులను గౌతు శిరీష పరామర్శ

విశాలాంధ్ర-మందస : మండలం సాబకోట పంచాయితీ బుడంబో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థినిలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గౌతు శిరీషా పరామర్శించి వండ్లు పంపిణీ చేశారు. అనంతరం 2016 ఏడాదిలో తన తండ్రి మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ హయంలో కోటి రూపాయలతో కట్టిన భవనాన్ని సందర్శించారు. ఆమెతో పాటు భావన దుర్యోదన, దాసరి తాతారావు, రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, నవీన్‌కుమార్, తమిరి భాస్కర రావు, డొంకురు తిరుపతి, ఎం.చంద్ర శేఖర్, గార క్రిష్టారావు, నానిబాబు, శ్యామల, దేబాసిస్ పండా, తలగాన రాజశేఖర్, మంగల పాత్రో, మజ్జి తులసీదాస్‌లు పాల్గొన్నారు.

ఘనంగా గుఱ్ఱం జాషువా వర్ధంతి

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : ఆధునిక తెలుగు కవులలో స్థానం పొందిన కవి గుఱ్ఱం జాషువా (సెప్టెంబర్ 28, 1895 - జూలై 24, 1971). సమకాలీన కవిత్వ ఒరవడియైన భావ కవిత్వ రీతి నుండి పక్కకు జరిగి, సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేశాడని, తక్కువ కులంగా భావించబడ్డ కులంలో జన్మించినందు వలన అనేక ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని ఈ మూఢాచారాలపై తిరగబడి ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందాడని జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్ట చంద్రపతిరావు పేర్కొన్నారు. గుఱ్ఱం జాషువా వర్ధంతి సందర్భంగా సోమవారం నగరంలో గల జ్యోతిరావ్‌పూలే పార్కులో గల జాషువా విగ్రహానికి నివాళులు అర్పించారు. సందర్భంగా చంద్రపతిరావు మాట్లాడుతూ గుఱ్ఱం జాషువా, పిరదౌసి, గబ్బిల, హరిచంద్ర నాటకం, తదితర కవితలురచించారని, అనేక కవితలు సామాజిక స్పృహ కలిగించే కవితలు వ్రాసి కవి సర్వభౌముడిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్ట చంద్రపతి రావు అధ్యక్షత న జరిగిన ఈ కార్యక్రమంలో విగ్రహ బహుకరణ కర్త కంతం వేణు, ప్రముఖ బహుజన నాయకులు కల్లే పల్లి రామగోపాల్, గుత్తు చిన్నారావు, కర్రీ రంగాజీ దేవ్, బీసీ సంఘం పట్టణ కార్యదర్శి రావు పల్లి సురేంద్ర, సంవలాపురం కిషోర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలలు వేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం హరిశ్చంద్రపురం జాతీయరహదారి మధ్యలో హరిశ్చంద్రపురం రోడ్డులో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం వనవిష్ణుపురం గ్రామానికి చెందిన గొల్ల రామక్రిష్ణ (40) మృతి చెందాడు. రామక్రిష్ణ ద్విచక్రవాహనం పై తన స్వగ్రామం వనవిష్ణుపురం వెలుతుండగా హరిశ్చంద్రపురం దాటిన తరువాత జాతీయ రహదారికి సమీపంలో ఒక మలుపు వద్ద ఎదురుగా వస్తున్న అదే మండలం బొద్దాం గ్రామానికి చెందిన డీసీఎం వ్యాన్‌కు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో రామక్రిష్ణ అక్కడకక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు తిరుమలరావు, శేఖర్‌లు, తండ్రి అప్పయ్య, తల్లి లచ్చమ్మలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ అసుపత్రికి తరలించి స్థానిక ఎస్ఐ షేక్‌మహ్మద్ ఆలీ కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-కవిటి : మండల కేంద్రమైన కవిటి శ్రీకళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బాలగంగాధర్ తిలక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాలగంగాధర్ తిలక్ జీవితంపై వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థులు పాల్గొని తిలక్ ఆశయాలు భారతదేశానికి చేసిన సేవలు విద్యార్థులు ప్రసంగించారు. సోషల్ టీచర్ బాలగంగాధర్ తిలక్ యొక్కవిద్యాభ్యాసం స్వతంత్ర పోరాటంలో అతను చరిత్ర విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ముందుగా తిలక్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. వక్తృత్వంలో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపల్ వండి బిందు మాధవి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ మహాశక్తి పథకాల ప్రచారం

విశాలాంధ్ర-సోంపేట : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం అమలు చేయబోయే మహాశక్తి పథకాలను వివరిస్తూ ఈ మండలం పాలవలస గ్రామంలో సోమవారం టీడీపీ మహిళ నేతలు ప్రచారం చేశారు. చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని సైకిల్ గుర్తుకి రాబోయే ఎన్నికల్లో ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సూరాడ చంద్రమోహన్, మురపాల ధర్మారావు, మల్లా సిద్దార్థ, మాసుపత్రి మధు, ఇచ్ఛాపురం మున్సిపల్ కౌన్సిలర్ ఆశి లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశయన సంఘ అధ్యక్షునిగా తిరుమల

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం బారువ మేజర్ పంచాయతీలో శ్రీశయన సంఘం అధ్యక్షునిగా చొక్కల తిరుమలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘ నూతన కమిటీ ఎన్నికలు సోమవారం ఏకగ్రీవంగా జరిగాయి. ఉపాధ్యక్షునిగా లొట్ల ఢిల్లీ, కార్యదర్శిగా ఆనింగి తేజ, జాయింట్ సెక్రటరీగా చొక్కల రమేష్, కోశాధికారిగా లొట్ల శ్యాం, సంయుక్త కోశాధికారిగా బొర్ర శ్యాం ఎన్నికయ్యారు. సంఘ సలహాదారుగా లొట్ల నాగరాజు నియమితులయ్యారు. వీరిని బారువకు చెందిన భవానీ యూత్ తరపున శుభాకాంక్షలు తెలిపారు.

పద్మారావు జన్మదిన వేడుకలకు ఆహ్వానం

విశాలాంధ్ర-సోంపేట : కవి, జాతీయ దళిత ఉద్యమకారుడు, రచయిత డాక్టర్ కత్తి పద్మారావు జన్మదిన వేడుకలకు ఆహ్వానం పలుకుతూ స్థానిక జైభీం సేన ఆధ్వర్యంలో సోమవారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నగిరి మోహనరావు తదితరులుపాల్గొన్నారు.

విద్యార్థులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్‌గ్రూప్ గుర్తింపు

విశాలాంధ్ర-అరసవల్లి: రెడ్ క్రాస్ అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ శ్రీకేస్ బి లాఠకర్ ఆదేశాల మేరకు రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో జూనియర్, కాలేజీ, డిగ్రీ కాలేజీ, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంజనీరింగ్ తదితర విద్యాసంస్థల్లో ఉన్న ప్రతీ విద్యార్థికి తెలియజేయజేస్తే అర్హత ఉండి బ్లడ్ గ్రూప్ తెలిసిన విద్యార్థులు అత్యవసర పరిస్థితుల్లో స్పందించిన రక్తదానంచేసి ప్రాణాలను కాపాడవచ్చని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ తెలియడం ద్వారా అత్యవసర పరిస్థితులలో తోటి వారికి సహాయ పడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధనా సిబ్బంది రెడ్ క్రాస్ ప్రతినిధులు కే.సత్యనారాయణ పి. చైతన్యకుమార్, సుజాత పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలను దాసునాయుడు పరామర్శ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : మండలంలోగల పలు కుటుంబాలను జిల్లా తెలుగుదేశంపార్టీ యువత అధ్యక్షుడు మెండ దాస్ నాయుడు పరామర్శించారు. ఇటీవల కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సంతబొమ్మాళి మండలం మాజీ ఎంపీప చితపాన ధర్మార్జున్ రెడ్డి చికిత్స పొందుతున్న ఆయన్ను కొల్లిపాడు వచ్చి పరామర్శించారు. అలాగే సంతబొమ్మాళి మేజర్ పంచాయతీలో ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాధపడుతున్న, మృతి చెందిన కుటుంబాలను, దాసునాయుడు పరామర్శించారు. అలాగే అయా గ్రామాల్లో పర్యటించి ఆయా కుటుంబాల క్షేమ సమాచారం తెలుసుకున్నారు. అలాగే తాళ్లవలస గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులను పరామర్శించి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. ఆయనతోపాటు కోటబొమ్మాళి మాజీ ఎంపీపీ వెలమల విజయలక్ష్మి కామేశ్వరరావు, సంతబొమ్మాళి మండలానికి చెందిన మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు, మండల తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, రెడ్డి అప్పన్న, మాజీ సర్పంచులు మెండ అప్పారావు, కూచెట్టి కాంతారావు, మాజీ ఎంపీటీసీ ప్రతినిధి పప్పు కృష్ణారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు బెండి అరుణ్ కుమార్,కుచెట్టి భానుప్రకాష్, చల్ల జగ్గారావు, శవ్వాన ప్రసాదరావు, అల్లు రమేష్ తోపాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి

ఐప్వా జిల్లా కన్వీనర్ కోనాలి ఈశ్వరమ్మ

విశాలాంధ్ర-పలాస : మణిపూర్‌లో ఇటీవల జరిగిన అమానవియ ఘటనకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బిరేన్‌సింగ్ , కేంద్ర హెూం మంత్రి అమిషాలు రాజీనామా చేయాలని అఖిల భారత ప్రగతి శీల మహిళా సంఘం (ఐప్వా) జిల్లా కన్వీనరు కోనాలి ఈశ్వరమ్మ, రైతు సంఘం నాయకులు మద్దిల రామారావులు డిమాండ్ చేశారు. సోమవారం బొడ్డపాడు పంచాయితీ మామిడిపల్లి గ్రామంలో సంఘం సభ్యులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో కుకీ తెగలకు చెందిన గిరిజన మహిళలను పరమ పాశవికంగా సభ్య సమాజం సిగ్గు పడే విధంగా వివస్త్రరణ చేసి ఊరేగించి హత్యాచారం చేయడం దారుణమని ఖండించారు. జరిగిన సంఘటనకు కేంద్ర మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ నడుపుతున్న కేంద్రంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి, మణిపూర్‌లో పెట్టిన రిజర్వేషన్ల చిచ్చు వలన 140 మందికి పై కుకీ గిరిజనులు ప్రాణాలు కోల్పోయారని, విపరీతమైన ఆస్తులు దగ్గమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రధాని ఈ రోజు వరకు మణిపూర్‌ను దర్శంచకపోవడంతో బాధ్యతరహిత్యం కాదా అని ప్రశ్నించారు. ఆటో మొబైల్ షాపులో పని చేస్తున్న ఇద్దరి మహిళలను హత్యాచారం చేసి తరువాత హత్య చేయడం సభ్యసమాజం సిగ్గుపడే విధంగా ఉందని అన్నారు. తక్షణమే దోషులందరినీ అరెస్టు చేయాలని మణిపూర్‌లో శాంతిభద్రతను ముఖ్యంగా కుకీ గిరిజనులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ ఎం.ఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు వంకల అప్పయ్య, పోతనపల్లి అప్పారావు, పాపయ్య, శాంతమ్మ, పార్వతి, అరుణ, సుందరమ్మ, తులసమ్మలు పాల్గొన్నారు.

క్రీడలకు ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక స్థానం : మున్సిపల్ మాజీ చైర్మన్ కోత

విశాలాంధ్ర-పలాస: ఆంధ్రప్రదేశ్‌లో క్రీడలకు ప్రత్యేక స్థానముందని, క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి దృష్టి సారిస్తున్నారని పలాస కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు కోత పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం రాత్రి నెల్లూరు జిల్లా కావలిలో ఆంధ్రప్రదేశ్ బాల్‌బ్యాడ్మింట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 2020-23 వార్షిక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడలపై క్రీడాకారుల మనస్సులో నిఘూడంగా ఉంచేందుకు సంఘం సభ్యులు చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో గల 13 జిల్లాల సంఘ సభ్యులు సమావేశానికి ఆలోచన చేస్తున్నామని, త్వరలో అధి సాకారమవుతుందని అన్నారు. సభ్యుల్లో క్రీడలపై అంతర్మధనం జరగాలని, క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావాలని అన్నారు. ప్రతి జిల్లాలో క్రీడాకారులను తయారు చేసుకునే బాధ్యత సంఘంపై ఉందని ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ విజయశంకర్ రెడ్డి, కార్యదర్శి ఆర్.వెంకటరావు, ట్రెజరర్ బి.ఆదినారాయణ, ఆర్గనైజనింగ్ కార్యదర్శి మురళీకృష్ణలతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

పొలంబడి శిక్షణ తరగతులు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: మండలం గొలివివానిపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాస్టర్ ట్రైనర్ లక్ష్మనాయుడు మాట్లాడుతూ ప్రతి వారం కూడా పొలంబడి లో ప్రకృతి వ్యవసాయ పద్దతులు గురించి వివరిస్తూ రైతులు పంట వేసిన మొదటి దశ నుండి మరల పంట తీసెంతవరకు ప్రతి దశలో ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించవలసిన కసాయాలు మరియు ద్రావణాలు గురించి వివరించారు. అలాగే ప్రస్తుతం వరి సాగులో సమగ్ర పురుగులు మరియు తెగుళ్ల గురించి, ప్రకృతి సేద్యంలో వాటి నివారణ గురించి మెరుగైన పద్దతులను వివరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్ శోభన్ పాల్గొన్నారు.

'వర్శిటీ విశిష్టత పెంచేలా విద్యార్థులు కెరీర్ మలుచుకోవాలి'

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ముఖ్యఅతిథిగా హాజరైన స్టీల్ ప్లాంట్ (విశాఖ) డిజిఎం(ట్రైనియర్) డా. అద్దంకి మురళీమోహన్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కోర్సుల్లో ఏ ప్రధానమైన సబ్జెక్టుల్లో డిగ్రీ పూర్తిచేసినప్పటికీ ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటునే ఎంచుకున్న రంగంలో మరిన్ని విజయాలు సాధ్యమన్నారు. 'వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య సి హెచ్.ఎ.రాజేంద్రప్రసాద్, వర్శిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్య బి. అడ్డయ్య, డా. సిహెచ్. రాజశేఖర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు హుషారుగా పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సచివాలయాలు ప్రజలకు దేవాలయాలు

వ్యవస్థను కించపరిచే వారికి బుద్ధి చెప్పండి : మంత్రి డాక్టర్ సీదిరి

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : ప్రజల ముంగిట పరిపాలనను తీసుకొచ్చిన సచివాలయాలు ప్రజలకు దేవాలయాలని రాష్ట్ర పశుసంవర్థక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. సోమవారం కొత్తపేట లో ఎంజిఎన్ ఆర్ ఈజీఎస్ నిధులు రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. సర్పంచ్ అంబటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేయడం జరిగిందని సచివాలయాల ఏర్పాటు సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సాధించిన పెద్ద విజయమని అన్నారు. సచివాలయ, వాలంటరీ వ్యవస్థల కోసం కించపరచి మాట్లాడుతున్న వారికి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలి అన్నారు. ఉదయానికి పొద్దు పొడుపుతో మీ ఇంటి తలుపు తట్టి సేవలు అందిస్తున్న వారిపట్ల అనుచితంగా మాట్లాడుతున్న పవన్, చంద్రబాబులకు తగిన విధంగా గుణపాఠం చెప్పాలని అన్నారు. అన్ని వయసుల వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే జగన్ ప్రభుత్వం గొప్పతనం అన్నారు. మహిళలు తమ పిల్లల చదువుల విషయంలో ఆత్మాభిమానం తాకట్టు పెట్టరాదనే ఉద్దేశంతో అమ్మఒడి పథకం రూపుదిద్దుకుంది అని చెప్పారు. ప్రభుత్వ పథకం మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులు ఖాతాలోకి బటన్ నొక్కడం ద్వారా జమ అవుతాయి అన్నారు. గత ప్రభుత్వాలకు, జగన్ ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసం గమనించాలని కోరారు. ఇంతటి సంక్షేమం గత ప్రభుత్వాలలో అందించారా అని ప్రశ్నించారు. జనరంజక పాలన అందిస్తున్న సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేయాల్సి బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, వైసీపీ అధ్యక్షుడు పి.గురయ్యనాయుడు, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, జడ్పిటిసి ప్రతినిధి పి. శ్రీను, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మద్దిల హరినారాయణ, దున్న బాలరాజు, సచివాలయ కోఆర్డినేటర్ వద్దీ కరుణాకర్, సర్పంచ్‌లు చింత రాజు, మామిడి భాస్కరరావు, హేమారావు, సుశీల, వంక చిరంజీవి, అట్టాడ గోపి, మాజీ ఎంపీటీసి ఇరోతు హేమంతరాజు, దువ్వాడ ఉమామహేశ్వర రావు, మాజీ సర్పంచ్ అంబటి రాజులు తదితరులు పాల్గొన్నారు.

బెంతు ఒరియాలను ఎస్టీలుగా గుర్తించాలి

- ఎస్టీ సర్టిఫికెట్ల జారీని పునరుద్ధరించాలి
- సభాపతిని కలిసిన బెంతు ఒరియా కుల ప్రతినిధులు

విశాలాంధ్ర-ఆమదాలవలస : శ్రీకాకుళం జిల్లాలో నివాసం ఉంటున్న బెంతు ఒరియా కులస్తులకు న్యాయం జరిగేలా చూడాలని కుల ప్రతినిధులు సభాపతి తమ్మినేని సీతారాంకు విన్నవించారు. ఈ మేరకు సోమవారం ఆముదాల వలసలో సభాపతి నివాసంలో బెంతు ఒరియా కుల ప్రతినిధులు కలిసి వినతి పత్రం సమ ర్పించారు. కొన్ని సంవత్సరాలు పాటు తమ సామాజిక వర్గానికి ఎస్టీ సర్టిఫికెట్లు రెవెన్యూ అధికారుల ద్వారా మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇటీవల కొన్ని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రెవెన్యూ శాఖ నుండి ఎస్టి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడాన్ని, ఉన్నతాధికారుల సూచనలతో నిలిపి వేశారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి కూడా జిల్లా యంత్రాంగం ద్వారా తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఇప్పటివరకు ఎటువంటి పురోగతి కనిపించడం లేదన్నారు. తమ సమస్యలపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్ నేతృత్వంలో ఏక సభ్య కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమిటీ తన నివేదికను వెల్లడించిందన్నారు. బెంతు ఒరియాలను ఎస్టి కుల జాబితాలో చేర్చేందు కు ప్రభుత్వానికి సిఫార్సు చేసిందన్నారు. దీనిపై పూర్తిస్థాయి నోటిఫై జరిగేంతవరకు, మునుపటి వలె తమకు ఎస్టి కుల ధ్రువీకరణ పత్రాలు రెవెన్యూశాఖ ద్వారా మంజూరు జరిగేలా చొరవ చూపాలని సభాపతికి విన్నవించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు దృష్టి తమ సమస్యను తీసుకెళ్లి పూర్తిస్థాయి న్యాయం జరిగేందుకు సహకరించాలని స్పీకర్ తమినేని సీతారాంకు కుల ప్రతి నిధులు విన్నవించారు. ఈకార్యక్రమంలో పాలవలస సర్పంచ్ గజ్జన మోహన్‌రావు, పెద్దపాలెం సర్పంచ్ సర్దార్ గురువుల నాయుడు, గద్ది ప్రసాదు, మురళీ ప్రసాద్, శంకర్రావులు వున్నారు.

ఫోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పాతపట్నం: ఆడపిల్లలపై జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవడం కోసం ఫోక్సో చట్టాన్ని తీసుకు వచ్చింది ప్రభుత్వం వికృత చేష్టలతో పిల్లల జీవితాలను హరించి వారికి ముప్పు వాటిల్లేలా చేస్తే ఈ చట్టం ద్వారా కఠినంగా శిక్షిస్తరని. శారీరకంగా, మానసికంగా వారిని వేధిస్తే నిందుతులపై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటారు. విద్యార్థులు, వారి తల్లి దండ్రులు, పాఠశాల యాజమాన్యం ముందు జాగ్రతలు వహిస్తే ఎలాంటి ఘటనలకు చోటుండదని, ఉపాధ్యాయులతో పాటుగా తల్లిదండ్రులు కూడా అనునిత్యం పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలని ఏఎస్ఐ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం ఆయన ఇద్దరు మహిళా పోలీసు సిబ్బందితో కలిసి పాతపట్నం మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ కాన్వెంట్ స్కూల్లో విద్యార్థిని విద్యార్థులకు చట్టాలు, మానవ మోసాలు, మానవ అక్రమ రవాణా, విద్యార్థినుల ఆత్మ సంరక్షణ, సెక్యూరిటీ క్యూఆర్ కోడ్ పిటిషన్, ఫోక్సో చట్టాల గురించి అవగాహన కల్పించారు. ప్రధానంగా విద్యార్థినులు తమపట్ల ఎదుటివారి ప్రవర్తను గుర్తించి సరియైన మార్గంలో ఉంటేనే మాట్లాడాలని, లేని పక్షంలో వారికి దూరంగా ఉండాలన్నారు. ఎవరైన అనుచిత మాటలు మాట్లాడినా పరిచయం లేకున్నా వచ్చి పదే పదే మాట్లాడాలని చూసినా వెంటనే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. సమాజంలో ఎవరైన మహిళలను, విద్యార్థినులను ఇబ్బంది పెడితే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు ఏఎస్ఐ టి.శ్రీనివాసరావు హెడ్ కానిస్టేబుల్ వరలక్ష్మి కానిస్టేబుల్ చిన్నమ్మడు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: నిర్ణీత సమయంలో స్పందన అర్జీలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో కలెక్టర్‌తోపాటు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆయా శాఖల దరఖాస్తులు తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధికారులు స్పందన అర్జీలు పై దృష్టి సారించి నాణ్యమైన సమాచారంతో తిరిగి అర్జీదారులకు సమాదానం పంపాలన్నారు. బియాండ్ ఎస్-ఎల్ఎలోని పెండింగ్ లో ఉన్న పోలీసు, పంచాయతీ రాజ్, ఐసిడిఎస్, రెవెన్యూ, డిపిఒ, జియస్డబ్ల్యూఎస్, తదితర శాఖల అధికారులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్లు, ఎంపిడిఓలతో వెబ్ కాస్టింగ్ ద్వారా మాట్లాడుతూ జగనన్నకు చెబుదాము 7 అర్జీలు ఉండగా ఇందులో పంచాయతీ రాజ్, పోలీసు, వెల్ఫేర్ అసిస్టెంట్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, తదితర శాఖలకు చెందిన అర్జీలు పెండింగ్ లో ఉన్నాయని వివరించారు. ఏ ఒక్క మండలంలోనూ పెండింగ్ లో లేకుండా చూడాలన్నారు. పెండింగ్ లో ఇకెవైసిని పూర్తి చేయాలని ఆదేశించారు. స్పందన అర్జీలపైన సమీక్షించారు. ఎపి పోర్టల్ లో సర్వే, డియస్ఓ, తదితర శాఖలకు సంబంధించి అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సర్టిఫికేట్స్‌కు సంబంధించి అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే జారీ చేయాలని ఆదేశించారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామం వద్ద సుడా ఏర్పాటు చేసిన స్మార్ట్ టౌన్ షిప్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపాలిటీ, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, సమగ్ర శిక్ష, పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ శాఖ, ఇరిగేషన్, తదితర శాఖల సమస్యలు పై అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి మురళీకృష్ణ, ఉప కలెక్టర్ జి.జయదేవి, డిఆర్డిఎ పిడి విద్యాసాగర్ పాల్గొన్నారు. స్పందన కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

- వైకాపా టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జీ దువ్వాడ వాణి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ప్రజల సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏర్పాటు చేయడం జరిగిందని టెక్కలి నియోజకవర్గ వైకాపా ఇన్‌చార్జీ దువ్వాడ వాణి అన్నారు. మండలం పెద్దబమ్మిడి సచివాలయం వద్ద ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వరావు, జడ్పీటీసీ దుబ్బ వెంకటరావులతో కలిసి ఎంపీడీవో కె. ఫణీంద్రకుమాం ఆద్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. లబ్ధిదారులకు ఫ్యామిలీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్ళలో అనేక పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. అర్హులు ఎవరికైనా పథకాలు అందని వారు ఉంటే గుర్తించి వారికి కూడా అందించటం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరో సారి వైసీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని ప్రజలకు కోరారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలు ప్రజలకు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మెండ తాత, తలగాన గణపతి, ఎంపీటీసీలు మెండ జగన్, కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ ఎస్. హేమసుందరరాజు, మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు-మన ఎమ్మెల్యే కార్యక్రమానికి కృష్ణదాస్ శ్రీకారం

విశాలాంధ్ర-నరసన్నపేట : జిల్లా వైసిపి అధ్యక్షులు, మాజీ డిప్యూటీ సిఎం, ధర్మాన కృష్ణదాస్ మన ఊరు-మన ఎమ్మెల్యే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష కార్యక్రమాలతో బిజీగా వున్న ఆయన క్షేత్రస్థాయిలో ప్రజలు శత శాతం సంతృప్తి లక్ష్యంగా మన ఊరు-మన ఎమ్మెల్యే అంటూ వినూత్న కార్యక్రమానికి తెర తీశారు. సోమవారం మబగాంలో తన స్వగృహంలో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాలకు చెందిన పలు ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. అంతేకాక ప్రతీ రోజూ పై మండలాల్లో ఒక్కో గ్రామానికి చెందిన పార్టీ పెద్దలు, కార్యకర్తలు, నాయకులతో సమావేశమవుతారు. వ్యక్తిగత, సామూహిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో అక్కడికక్కడే సమస్యలు పరిష్కారం అయ్యేలా చేస్తారు. ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం రెండు గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పెద్దలుతో ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలు, ప్రజల్లో పాలన పట్ల సంతృప్తి, అసంతృప్తి విధానాలపై సమీక్షించి, భవిష్యత్తు ప్రణాళికపై చర్చిస్తారు.

27న రిక్షా పుల్లర్స్ కోఆపరేటీవ్ సొసైటీ

- అసిస్టెంట్ రిజిష్ట్రార్ జి.వి.రమణమూర్తి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : రిక్షాపుల్లర్స్ కోఆపరేటీవ్ సొసైటీ లిమిటెడ్ నెంబర్ ఎ 667 వారి సర్వసభ్య సమావేశాన్ని మహాజన సభ నిర్వహించనున్నట్టు సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.వి. రమణమూర్తి తెలిపారు.శ్రీకాకుళం రిక్షాపుల్లర్స్ కోఆపరేటీవ్ సొసైటీ లిమిటెడ్ నెంబర్ %ూ% 667 .వారి సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 27 గురువారం ఉదయం10 గంటలకు జిల్లా సహకార శాఖ కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు. జిల్లా సహకార అధికారి సూచన మేరకు ఇన్స్పెక్షన్ అధికారి ఇన్స్పెక్షన్ జరిపి నివేదికను ఇవ్వడం జరిగిందని కావున శ్రీకాకుళం రిక్షాపుల్లర్స్ కోఆపరేటీవ్ సొసైటీ లిమిటెడ్ నెంబర్ %ూ% 667 .వారి సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 27 గురువారం ఉదయం10 గంటలకు జిల్లా సహకార శాఖ కార్యాలయంలో జరుగుతుందని సభ్యులందరు మహాజన సభకు వచ్చి అభిప్రాయం తెలపాలని ఆయన తెలిపారు.

పారిశుధ్య పనులపై దృష్టి సారించండి

విశాలాంధ్ర-మెళియాపుట్టి : వర్షాకాలం దృశ్య గ్రామాలలో వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్న దృశ్య వాటిని నిర్మూలించే దిశగా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా గ్రామాలలో పారిశుద్య పనులు జరిగేలా కృషి చేయాలని స్పందన కార్యక్రమం ద్వారా తహసిల్దార్ సరోజినీకి జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు గేదెల చైతన్య వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు పంచాయతీలలో పారిశుధ్య పనులు అంతంత మాత్రమే జరుగుతున్నాయని వర్షకాలం దృశ్య సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ప్రతి గ్రామంలో సైతం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలంలో మారుమూల గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తహసిల్దార్ దృష్టికి తీసుకుని వెళ్లారు. గేదెల చైతన్యతో పాటు జనసేన పార్టీ నాయకులు దుక్క బాలరాజు, ప్రశాంత్ కుమార్ తదితరులున్నారు.

శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం నూతన కార్యవర్గం

- దేవాలయం ప్రగతిలో కీలక భూమిక వహించాలి

- ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారంలో సభాపతి తమ్మినేని

విశాలాంధ్ర -ఆమదాలవలస: దేవాలయాల ప్రగతి బాట పట్టించడంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు కీలకంగా పని చేయాలని ఏపీ శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ఈవో కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో కొలువై యున్న వెంకటేశ్వర స్వామి దేవాలయం కు విశిష్టమైన చరిత్ర ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజానీకానికి స్వామివారి పట్ల అపారమైన నమ్మకం ఉందన్నారు. నిత్యం భక్తులు యొక్క దర్శనాలతో దేవాలయం అభివృద్ధికి నూతన కార్యవర్గం ఇతోదికంగా కృషి చేయాలని కోరారు. దేవాదాయ శాఖ అధికారుల విలువైన సలహాలు సూచనలతో వెంకటేశ్వర స్వామి ఆలయం విశిష్టతను కాపా డాలన్నారు. భక్తుల విశ్వాసాలకు తగ్గట్టుగా ఆలయంలో మరిన్ని సేవలు పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఫ్లోర్ లీడర్ ఉమామహేశ్వరరావు జెకె వెంకబాబు, దుంపలు శ్యామలరావు, శిల్లా మల్లేశ్వరరావు, సంపత్‌రావు రామారావు, సాదు చిరంజీవి తదితర వైఎస్ఆర్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రమేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : కోటబొమ్మాళి మండల తెలుగుదేశం పార్టీ అద్యక్షుడు బోయిన రమేష్ జన్మదిన వేడుకలు స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమా నులు మధ్య సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి ఆలయంలో రమేష్ అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో నాయకుల మధ్య రమేష్ కేకును కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అలాగే తన పుట్టిన రోజు సందర్భంగా తన సొంత ఖర్చుతో తెలుగుదేశం కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు ఉచితంగా భోజనం పెట్టారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ అద్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, తెలుగుదేశం పార్టీ జిల్లా యుత అద్యక్షుడు మెండ దాలినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మాజీ ఏఎంసీ చైర్మన్ వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, మాజీ ఎంపీపీ తర్ర రామక్రిష్ణ, కర్రి అప్పారావు, కోరాడ గోవిందరావు, మెండ సింహాచలం, తంగుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఆమదాలవలస ఐసిడిఎస్ పరిధిలో ఐదు అంగన్వాడీ హెల్పర్ పోస్టు భర్తీకిగాను సోమవారం విడుదల చేసినట్లు సిడిపిఓ. కె.వి బాలమణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం నుండి కార్యాలయం పని దినాల్లో ఆగస్టు మూడో తేదీ వరకు స్వీకరిస్తామని తెలిపారు. 8వ తరగతి ఉత్తీర్ణులైన మహిళా అభ్యర్థులు స్థానికత ఉండేవారు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వయస్సు 21 నుంచి 35 సంవత్సరాల మధ్యలో ఉండాలని వివరించారు. వంజంగి, చిట్టివలస, రావికండి పేట హెల్పర్ పోస్టులకు గాను ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లోలుగు, మునగవలస హెల్పర్ పోస్ట్ లకు ఓసి అభ్యర్థుల అర్హులు అన్నారు. దరఖాస్తులు పరిశీలన అనంతరం శ్రీకాకుళంలో మౌఖిక పురాత పరీక్షల ఆధారంగా ఎంపిక చేయబడునని వివరించారు.

ఈనెల 31న పీడీఎస్ బియ్యంను బహిరంగ వేలం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: ఈనెల 31వ తేదీ సోమవారం మద్యాహ్నం 3 గంటలకు కోటబొమ్మాళి ఎంఎల్ఎస్ గొడౌన్ వద్ద 3090కిలోల పీడీఎస్ బియ్యాన్ని జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు బహిరంగ వేలంపాట నిర్వహించటం జరుగుతుందని తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ సోమవారం తెలిపారు. ఈ బియ్యాన్ని గత ́యేడాది డిసెంబర్ 14వ తేదీనా కోటబొమ్మాళికి చెందిన బోయిన క్రిష్టారావు కోటబొమ్మాళి నుంచి ఆటోలో అక్రమంగా నరసన్నపేట తీసుకు వెళ్తుండగా కిష్టుపురం జంక్షన్ వద్ద ఉప తహశీల్దార్, మండల రెవెన్యూ పరిశీలకు దాడిచేసి పట్టుకొని సీజ్ చేయటం జరిగిందని. ఈ సీజ్ చేసిన బియ్యాన్ని కోటబొమ్మాళి ఎంఎల్ఎస్‌గొడౌన్‌లో ఉంచి కలెక్టర్ ఆదేశాలు మేరకు బహిరంగ వేలంపాట వేయటం జరిగుతుందని అసక్తిగల వారు వేలంపాటలో పాల్గొన్నాలని అమె సూచించారు.

నైపుణ్యతతో రాణించాలి

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: నైపుణ్యత సాధించినప్పుడే క్రీడాకారులు మరింతగా రాణించే అవకాశం ఉంటుందని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు అన్నారు. మాస్టర్ సాయి బాబా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల్లో ప్రతిభావంతులకు బ్లూ, గ్రీన్, ఎల్లో, ఆరెంజ్ బెల్ట్స్ పంపిణీ కార్యక్రమం స్థానిక అఫీషియల్ కాలనీలో అబ్దుల్ కలాం పార్క్ లో సోమవారం నిర్వహించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సామాజిక న్యాయపోరాట సమితి(ఎస్ఎన్ఎస్) రాష్ట్ర అధ్యక్షులు కల్లేపల్లి రాంగోపాల్ మాట్లాడుతూ జిల్లాలో మార్షల్ ఆర్ట్స్ అభివృద్ధి చేయడంలో రావులసాయిబాబా విశేష కృషి చేశారని, ఆయన శిష్యబృందం ఎందరో క్రీడాకారులను తయారు చేస్తుండడం అభినందనీయమన్నారు. పాతపట్నం తహశీల్దార్ శైలజ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణకు దోహదపడు తుందన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు, చీఫ్ కోచ్ గాయత్రీతోపాటు ఎన్.చంద్రరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి 133వ జన్మదినోత్సవం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి: గ్రంథాలయాల ఉద్యమకారుడు అయ్యంకి వెంకటరమణయ్య 133వ జన్మదినోత్సవం కార్యక్రమం సంత బొమ్మాళి శాఖ గ్రంథాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా అయ్యంకి చిత్ర పటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భవిత పాఠశాల ఉపాధ్యాయులు భాస్కరరావు, సంతబొఎంమ్మాళి శాఖా గ్రంథాలయం అధికారి కె. కృష్ణారావు, పాఠకులు, నారాయణ, సుజాత సంతబొమ్మాళి ఎంపీయూపి పాఠశాల విద్యార్థులు, గ్రంథాలయ అటెండర్ బాబురావు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేసిన ఎస్ఐ

- జీల్ ఫౌండేషన్, సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి సభ్యులకు అభినందన

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: నగరంలో గల అరసవల్లి ఆదిత్యనగర్ ప్రాంతంలో మూడు నిరు పేద కుటుంబాలకు 75 కేజీల రైస్‌తో పాటు, రెండు నెలలకు సరిపడే నిత్యవసర సరుకులను జీల్ ఫౌండేషన్, సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి అధ్వ ర్యంలో శ్రీకాకుళం వన్‌టౌన్ ఎస్ఐ వారణాసి వెంకటేశ్వరరావు సోమవారం అందజేసి మాట్లాడుతూ సామాజిక సేవలో బాగమవ్వటం నా అదృష్టమని, జీల్ ఫౌండేషన్ ప్రతి నిత్యం ఏదో ఒక సామాజిక కార్యక్రమాలను చేస్తుండటం అభినందనీయ మన్నారు. ప్రతీ ఒక్కరిలో సేవా గుణం ఉంటుందని, సేవ చెయ్యటం అదృష్టంగా భావించి, నిస్సాహా యులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం కొంత నగదు మూడు కుటుంబాలకు అందజేశారు. ఇందులో భాగంగా ఎస్ఐని దుశ్శాలువాతో జాడ చంద్రశేఖర్‌తో పాటు సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీల్ ఫౌండేషన్ అధ్యక్ష్యులు సత్యసాయి, ఉప అధ్యక్షులు జాడ సాయి, సెక్రటరీ కే.శివ, డా. రంగుడు. ప్రియాంక, తెలుగు రామారావు అపార్ట్మెంట్ సభ్యులు జగదీశ్, గ్రీన్‌సిటీ అధ్యక్షురాలు మణిశర్మ, చంద్రకాంత్, సామాజిక కార్యకర్త నంది ఉమాశంకర్, లైన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం. సునీల్, సిక్కోలు స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు అవినాష్, రాజు యాదవ్, జర్నలిస్ట్ లు నవతరం సీఈవో చైతన్య, ఉర్లాం. శివతేజ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పలాస నియోజకవర్గంలో రాజకీయ సందడి..!

విశాలాంధ్ర-పలాస : పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు మరో 8నెలలు వ్యవధిలో జరుగుతుండడంతో పలాస నియోజకవర్గంలో రాజకీయాలు ఎత్తుగడలతో ఆసక్తికరంగా ఉన్నాయి. నియోజకవర్గంలో వైసీపీ, టీడీపీ, జనసేన, సిపిఐ,. సిపిఎం, సిపిఐ ఎం.ఎల్, కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఉన్నప్పటికీ ప్రధానంగా వైసీపీ, టీడీపీ పార్టీల మధ్యే పోటీ ఉంటుందని పరిశీలకులు భావిస్తున్నారు. నియోజకవర్గంలో గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయకుండా చేతులెత్తేయడంతో అధికార వైసీపీ సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పిటిసి అభ్యర్థులు గెలిచి సత్తా చాటారు. రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తనదైన శైలిలో మేధాశక్తితో నియోజకవర్గంలో ప్రభుత్వ పరంగా అభివృద్ధి పనులు చేస్తూ దూకుడు పెంచి ప్రత్యర్థులను దడ పుట్టిస్తున్నారని పరిశీలకులు అంటున్నారు. అయితే మంత్రి డాక్టర్ సీదిరి రాజకీయంగా దూసుకుపోతున్నప్పటికీ అంతే స్థాయిలో ఆయనకు వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకుల అసమ్మతి బెడద, అలక పాన్పులు తప్పడం లేదు. ముఖ్యంగా ఆయనను పూర్వపు వైసీపీ సీనియర్ కేడరు అనుసరించడం అతి తక్కువగా ఉంది. పార్టీ ఆవిర్భావం నుంచి 2011 నుంచి జెండా పట్టుకొని తిరిగిన కార్యకర్తలు, చోటా నాయకులు మంత్రి నిర్వహిస్తున్న పార్టీ సమావేశాల్లో కూడా గత నాలుగేళ్లుగా కనిపించడం లేదు. ఈ విషయం పార్టీ శ్రేణుల్లో చర్చ భారీగా సాగుతోంది. మంత్రిని కాళింగ, అగ్నికుల క్షత్రియ, కాపు కుల సంఘాల నాయకులు దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేంబాబు చౌదరి, జుత్తు నీలకంతం, వడిశ హరిప్రసాద్ వంటి వారు, వీరి అనుచర గణం వైసీపీలో ఉంటూ మంత్రితో విభేదాలతో వ్యతిరేకంగా నియోజకవర్గంలో తిరిగి రాజకీయ సమీకరణలు చేస్తున్నారు. వీరంతా కుల సంఘాల సమావేశాలు కూడా అప్పుడప్పుడు ఏర్పాటు చేసి పిక్నిక్‌ల సందడి చేస్తున్నారు. అయితే మంత్రి డాక్టర్ సీదిరి తనకు ఎన్ని అడ్డంకులు వచ్చినా అసమ్మతి ఉన్నా ఖాతరు చేయకుండా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ చరిష్మాతో రాజకీయంగా దూకుడు ప్రదర్శిస్తున్నారు. టీడీపీ ఇన్‌చార్జీ గౌతు శిరీషా తన తండ్రి గౌతు శివాజీ సలహాలు, సూచనలతో టీడీపీ రాజకీయాలు చేస్తున్నప్పటికీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎం.పి రామ్మోహననాయుడు చేయూత లేకుండా ముందుకు సాగ లేకపోతున్నారు. నియోజకవర్గం తాజా రాజకీయ పరిస్థితులు, సమీకరణలు పరిశీలిస్తే మందస మండలం వైసీపీకి కంచుకోటగా కనిపిస్తోందని, వజ్రపుకొత్తూరు మండలంలో వైసీపీకి టీడీపీ గట్టి పోటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అలాగే పలాస మండలంలో వైసీపీ బలంగా ఉన్నా పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో కొంత వరకు పార్టీ వెనుకంజలో ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో వైసీపీకి టీడీపీ రాబోయే ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇకపోతే నియోజకవర్గంలో జనసేన, వామపక్షాలు, బిజెపి రాజకీయంగా 2019 ఎన్నికలు కన్నా ప్రస్తుతం బలపడ్డాయి. వామపక్షాలు, జనసేన పార్టీలు ప్రజా సమస్యలుపై పని చేస్తున్నాయి. బిజెపి, జనసేన దోస్తీతో అసెంబ్లీ అభ్యర్థిని నిలబెట్టేందుకు సన్నద్ధమవుతున్నాయి. వామపక్షాల తరుపున జాతీయ, కాంగ్రెస్ తరపున కూడా అభ్యర్థులు పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికీ వామపక్షాలు ప్రజా సమస్యలు, రైతాంగ సమస్యలుపై పోరాటం చేస్తూ ప్రజల పక్షాన నిలబడుతున్నాయి. గత ఎన్నికల్లో పోటీ చేసిన డాక్టర్ సీదిరి నియోజకవర్గానికి కొత్త కావడం డాక్టర్‌గా పేరు ప్రఖ్యాతులు సంపాదించడంతో ఆయన గెలుపు సునాయసమైంది. అయితే వచ్చే ఎన్నికలు మాత్రం నియోజకవర్గంలో పోటీ రసవత్తరంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

సింహాచలం కుటుంబాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర-పలాస : మండలంలో మాకన్నపల్లి గ్రామానికి చెందిన జీడి రైతు సింహాచలం ఇటీవలే ఆత్యహత్యకు పాల్పడిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషా సింహాచలం కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబంతో మాట్లాడి సంఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు భరోసా లేకుండా పోయిందని, అధికారం చేపట్టిన నాటి నుంచి జీడి మద్దతు ధరపై దాగుడు మూతలు ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీడికి మద్దతు ధర లేక, పెట్టుబడులతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబానికి తక్షణమే ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కోరారు. భవిష్యత్‌లో ఇటువంటి ఆర్థిక ఇబ్బందులతో మరణాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఇప్పటికీ చాలా మంది రైతుల వద్ద జీడిపిక్కలు ఉన్నాయని, ప్రభుత్వ నిర్ణయం కోసం చూస్తున్నారని, వాటిని గిట్టుబాటు మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట విఠలరావు, సప్ప నవీన్, తమ్మినాన ధనుంజయ, పోలాకి పాపారావు, కూర్మారావులు ఉన్నారు.

కాశీబుగ్గలో : అప్పులు బాధ తాళ లేక ఆత్మహత్య చేసుకున్న జీడి రైతు సైని సింహాచలం కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని జీడి రైతు సంఘం జిల్లా కన్వీనరు తెప్పల అజయ్ కుమార్, మాజీ సర్పంచ్ తెప్పల అప్పలస్వామి కోరారు సోమవారం మాకన్నపల్లి సచివాలయం అధికారులు టి.రాధ, ఝాన్సీలకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ మృతి చెందిన సింహాచలం కుటుంబానికి 20 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో కుత్తం వినోద్‌కుమార్, కుత్తం హేమావతి, టి.రాజు, జె.పోలమ్మ, ఎం.లక్ష్మణ్ కుమార్, కుత్తం ఈశ్వరి, ఎం.భారతమ్మ, జె.కిశోర్‌లు పాల్గొన్నారు.

వెంకటేశ్వర ఆలయ కమిటీ బాధ్యతలు స్వీకారం - అధ్యక్షునిగా శ్రీధర్ సాక

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలో కీర్తిశేషులు కాళ్ళ సీతారామస్వామి, సత్యవతి దంపతులు శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మాణం చేపట్టారు. కాళ్ల సత్యవతి ట్రస్ట్ పేరిట ఆలయ ఆస్తులు ఉన్నాయి. ఈ ఆలయం ఎండోమెంట్ ఆధ్వర్యంలో ఉంది. 2012 నుంచి పాలకవర్గం లేక ట్రస్టీల అనుమతితో దేవునికి ధూప దీప నైవేద్యాలు అందించేవారు. ఎట్టకేలకు అధ్యక్షులతో కలిపి ఏడుగురు సభ్యుల కమిటీని ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. సోమవారం ఏడుగురు సభ్యుల కమిటీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈవో సర్వేశ్వరరావు ముందుగా సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్పీకర్ తమ్మినేని సీతారాం కమిటీ అధ్యక్షునిగా శ్రీధర్ సాకా పేరును ప్రతిపాదించారు. అధ్యక్షునిగా శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులుగా బలివాడ సంతోషి రూప, కూర్మాన సుధారాణి, రోనంకి ఆరప్ప, జామి అనంతరావు, ముంగడి శ్రీనివాసరావు, శిల్లా ప్రశాంత్ లక్ష్మి సభ్యులుగా నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ నిబంధనల మేరకు వ్యవహరించి ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ప్రమాణ స్వీకారం చేశారు. ఎటువంటి రాగద్వేషా లకు తావు లేకుండా బంధు ప్రీతికి ఆస్కారం లేకుండా భక్తులకు నిరంతరం అసౌకర్యం కలుగకుండా సేవలు అందిస్తామని ప్రమాణ స్వీకారం చేశారు. ఇదిలా ఉండగా దేవదాయ శాఖ ఉత్తర్వులలో శిల్లా ప్రశాంత్ లక్ష్మి పేరును ప్రతిపాదించలేదు. విశ్రాంతి ఇండియన్ ఆర్మీ నాగభూషణ రావు భార్య కల్లేపల్లి పద్మ సుందరి దేవాదాయ శాఖ ఉత్తర్వులు ఉన్నాయి. స్థానిక నాయకత్వం ఆ పేరును మార్పు చేసి శిల్లా ప్రశాంత్ లక్ష్మిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, ఈవో, ఆలయ అర్చక బృందం తదితరులు ఉన్నారు.

ఆగస్టు 10లోగా త్రిబుల్ ఐటీలో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి

ఆర్జియూకేటీ ఛాన్సర్ ప్రొఫెసర్ కె సి రెడ్డి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్ జి యు కే టి) పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ లలో ఆగస్టు 10వ తేదీలోగా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేస్తామని ఆర్జీయూకేటీ ఛాన్సర్ ప్రొఫెసర్ కే సి రెడ్డి అన్నారు. శ్రీకాకుళం క్యాంపస్ (ఎచ్చెర్ల)లో 2023 - 24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు రెండు రోజులు పాటు నిర్వహించనున్న కౌన్సిలింగ్ ప్రక్రియ సోమవారం ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. ఇప్పటికే నూజివీడు, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీల్లో కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తయిందని శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్ లలో ఈ రెండు రోజుల్లో కౌన్సిలింగ్ పూర్తి అవుతుందన్నారు. నాలుగు ట్రిపుల్ ఐటీల్లోని 4,400 సీట్లకు తొలి విడత కౌన్సిలింగ్ అనంతరం మిగిలిన సీట్ల భర్తీకి తుది విడత కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు క్యాంపస్లలో చేరిన విద్యార్థులకు ఆగస్టు 10వ తేదీ నుంచి పియుసి ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభిస్తామన్నారు. ట్రిబుల్ ఐటీ విద్యా విధానంపై విద్యార్థులకు వారం రోజులపాటు అవగాహన తరగతులను నిర్వహిస్తామన్నారు. ఈ ఏడాది నుంచే నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎగ్జిట్ మోడ్ సౌకర్యాన్ని కల్పిస్తున్నా మన్నారు. కోర్సు పూర్తికాకుండానే మధ్యలో బయటకు వెళ్లాలనుకున్న విద్యార్థులకు తగిన నైపుణ్య శిక్షణతో పాటు అందుకు అనుగుణంగా సర్టిఫికెట్ ఇచ్చి పంపిస్తామన్నారు. అలాగే ఇంజనీరింగ్ విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఐ ఎస్ బి తో ఇంటర్నెట్ షిప్ కోసం ఫోరెన్సిక్ ఆల్ఫా అనే సంస్థతో ఆర్జియుకేటి ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఇంటర్న షిప్ లో విద్యార్థులకు ప్రోత్సాహకంగా రూ. 20 వేలను అందజేసి ప్రతిభ ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై అధ్యాపకులకు డిజిటల్ లెర్నింగ్ పై సెక్షన్ ఇస్తామని చెప్పారు. కాగా విద్యార్థులకు సీటు కేటాయింపు ధ్రువపత్రాలను ప్రొఫెసర్ కే సి రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వర్ రావు, ఓ ఎస్ డి ప్రొఫెసర్ ఎల్ సుధాకర బాబు, ఆర్జీయూకేటీ అడ్మిషన్లు కన్వీనర్ గోపాలరాజు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, శ్రీకాకుళం క్యాంపస్ అడ్మిషన్స్ కన్వీనర్ పి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. క్యాంపస్లో రూ. 4.2 కోట్లతో అధికారులు సిబ్బంది నివాస గృహ సముదాయ నిర్మాణానికి చాన్సులర్ ప్రొఫెసర్ కెసిరెడ్డి శంకుస్థాపన చేశారు.

- కోలాహలంగా క్యాంపస్... ఈ క్యాంపస్లో 1100 సీట్లు ఉండగా 540 మందినీ తొలి రోజు కౌన్సిలింగ్కు పిలవగా ఇందులో 453 మంది కౌన్సిలింగ్కు హాజరయ్యారు. కౌన్సిలింగ్లో పాల్గొనేందుకు దూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఆదివారం రాత్రి ఇక్కడికి చేరుకున్నారు. వారికి క్యాంపస్ లో వసతి సౌకర్యాన్ని కల్పించారు. విద్యార్థులు తల్లిదండ్రులతో సోమవారం క్యాంపస్ కోలాహలంగా మారింది. ఓవైపు వర్షం కురుస్తున్న ఎలాంటి అసౌకర్యము కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కవలలు దక్కించుకున్న ట్రిబుల్ ఐటీ సీట్లు జిల్లాలోని నందిగామ మండలం తైరాడ గ్రామానికి చెందిన మార్పు సంధ్య, మార్పు అలేఖ్య అనే ఇద్దరు కవలలు శ్రీకాకుళం ఐటీ లో సీట్లు దక్కించుకున్నారు. ఈ ఇద్దరు విద్యార్థులు తన తాతతో కౌన్సిలింగ్కు హాజరయ్యారు. సంధ్య పెద్ద శ్రీరాంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో అలేఖ్య పాత టెక్కలి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. అక్క చెల్లెలు అయిన కవలలు ఇద్దరు ట్రిపుల్ ఐటీ లో సీటు పొందడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

అన్ని సామాజిక వర్గాలకు అండగా నిలుస్తా...

- నాయీ బ్రాహ్మణ కుటుంబాలకు సామాజిక భవనం మంజూరు కృషి

- ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గంలో దశా బ్దాలు కాలంగా నివాసం ఉంటున్న అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా అన్ని విధాల అండగా నిలుస్తానని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొ న్నారు. సోమవారం నియోజకవర్గంకు చెందిన పలువురు నాయిబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన ప్రతినిధులు సభాపతిని కలిశారు. పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ప్రధానంగా తమ కులానికి నియోజకవర్గ కేంద్రంలో సామాజిక భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఇందుకు తగ్గ స్థలం మంజూరు అయ్యేలా చొరవ చూపాలని సభాపతి ని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ దశాబ్దాల కాలం పాటు తన రాజకీయ ప్రస్థానంలో అన్ని సామాజిక వర్గాలు ప్రజానీకం అండగా నిలిచారన్నారు. నాయి బ్రాహ్మణ కుటుంబాలకు అవసరమయ్యే సామాజిక భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జె కె వెంక బాబు,మరియు నాయి బ్రాహ్మణ కుల పెద్దలు పాల్గొన్నారు.

జగన్ పాలన దేశంలో ఎక్కడా చూడలేరు

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి లాంటి పాలన దేశంలో ఎక్కడా చూడలేమని రాష్ట్ర ప్రభుత్వం వ్యవహారాల సలహాదారులు ఫాదర్. బాలా స్వామి స్పష్టం చేశారు. సోమవారం రాగోలు దరి సిలోయము స్వసిత శాలలో శ్రీకాకుళం జిల్లా క్రిస్టియన్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరం ఆద్వర్యంలో జరిగిన క్రైస్తవ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం లో ఆయన పాల్గొని మాట్లాడుతూ క్రైస్తవ సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా క్రైస్తవుల కొరకు రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవ్యం తరుపున ముఖ్య సలహా దారునిగా నియమించడం జరిగిందని వివరించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల క్రైస్తవ సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని అందుకు శ్రీకాకుళం జిల్లాకు రావడానికి క్రిష్టియన్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరం సహకారం ఉందని బాలాస్వామి తెలిపారు. అన్ని మతా లను, కులాలను ప్రేమించే ముఖ్య మంత్రిగా జగన్ ఉన్నారన్నారు. దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. అనంతరం జిల్లా నలుమాలలనుండి వచ్చిన క్రైస్తవ నాయకులు, పాస్టర్లు నుండి అనేక సమస్యల వినతులను ఫాదర్ బాలస్వామి కి అందించారు. అందుకున్న వినతుల్లో ఉన్న సమస్యలను సిఎం కు తెలియజేస్తామని ఫాదర్ బాలస్వామి హామీయిచ్చారు. చివరగా ఫాదర్. బాలస్వామికు క్రిష్టియన్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరం అధ్యక్షులు జి. అరుణ్ కుమార్, ఉపాధ్యక్షులు ఒంపూరు రమేష్, ప్రధాన కార్యదర్శి పైడీ మోజేష్ రాజుతో పాటు జిల్లా పాస్టర్లు ఘనంగా ఫాదర్ బాలస్వామి నుసత్కరించారు.